

ఎన్నికల ప్రచారంలో మట్లాడుతున్న చింతా ప్రభాకర్

## అభివృద్ధి చేశా.. ఆశీర్వదించండి

■ ఎన్నికల ప్రచారంలో చింతా ప్రభాకర్

సంగారెడ్డి అర్బన్, నవంబర్ 5 : బీఅర్ఎస్ సంగారెడ్డి నియోజకవర్గ అభ్యర్థి చింతా ప్రభాకర్‌ను ఆశీర్వదించాలని గులాబీ శ్రేణులు ఇంటింటి ఎన్నికల ప్రచారం నిర్వహిచారు. సంగారెడ్డి మండలం లోని నాగపుర్, ఇర్గిపల్లి, కలాబ్‌గుర్, తాళపల్లి గ్రామాల్లో ఆదివారం ఎన్నికల ప్రచారం చేశారు. చింతా ప్రభాకర్‌కు గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. ఎన్నికల ప్రచారంలో చింతా ప్రభాకర్ మట్లాడుతూ.. సంగారెడ్డి నియోజకవర్గంలో అభివృద్ధి చేశానని.. ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. ప్రతిపక్ష పార్టీల మాయమాటలు నమ్మి మోసపోవద్దని సూచించారు. బీఆర్ఎస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను సంపూర్ణంగా అమలు చేస్తుందని తెలిపారు. ఎన్నికల ప్రచారంలో జడ్పీటీసీ సునీతామనోహర్‌గౌడ్, బీఅర్ఎస్ మండలాధ్యక్షడు చక్రపాణి, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### నేడు పుల్కల్ మండలంలో

## క్రాంతికిరణ్ ప్రచారం

పుల్కల్, నవంబర్ 5 : అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా మండలంలో అందోలు ఎమ్మెల్యే, బీఆర్ఎస్ అభ్యర్థి చంటిక్రాంతికిరణ్ సోమవారం ఎన్నికల ప్రచారం చేయనున్నారు. పుల్కల్ మండలకేంద్రంతోపాటు మండలంలోని మిన్పూర్, గొంగ్లూర్ గ్రామాల్లో అందోలు ఎమ్మెల్యే, బీఆర్ఎస్ అభ్యర్థి చంటి క్రాంతి కిరణ్ ఎన్నికల ప్రచారంలో పాల్గొంటారని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మాచర్ల విజయ్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం మధ్యాహ్నం 3:00 గంటలకు మండల కేంద్రమైన పుల్కల్‌లో డాక్టర్ అంబేద్కర్, చాకలి ఐలమ్మ, స్వామి వివేకానంద విగ్రహాలకు నివాళులర్పించి, బీఆర్ఎస్ మండల కార్యాలయాన్ని ప్రారంభిస్తారు. అనంతరం పుల్కల్ గ్రామంలో ఇంటింటి ప్రచారంలో పాల్గొంటారు. సాయంత్రం 5:00 గంటలకు మిన్పూర్ గ్రామంలో ప్రచారం నిర్వహిస్తారని తెలిపారు. రాత్రి 7 గంటలకు గొంగ్లూరు గ్రామంలో ప్రచారం చేస్తారన్నారు.

## మారేడ్‌మిల్లి టు హైదరాబాద్

■ గంజాయి సప్లై ■ నలుగురు అరెస్ట్



పోలీసులకు గంజాయితో పట్టుబడిన నిందితులు

సిటీబ్యూరో, నవంబర్ 5 (నమస్తే తెలంగాణ) : మారేడ్‌మిల్లిలో గంజాయి కొని హైదరాబాద్‌లో విక్రయించేందుకు ప్రయత్నిస్తున్న ముఠాను నార్త్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. డీసీపీ నితికాపంత్ కథనం.. సంగారెడ్డి గుమ్మిడిదలకు చెందిన మహ్మద్ అర్షద్ ఖాన్, మహ్మద్ ఇర్షద్‌ఖాన్ సోదరులు. వీరు స్నేహితులు రమావత్ రాహుల్, మహ్మద్ మజీర్ అహ్మద్‌తో కలిసి ముఠాగా ఏర్పడ్డారు. ఆంధ్రప్రదేశ్‌లోని మారేడ్‌మిల్లిలో గంజాయి కొని, హైదరాబాద్‌లో విక్రయించారు. ఈ క్రమంలో నాలుగు రోజుల క్రితం అర్షద్, రమావత్ మారేడ్‌మిల్లికి వెళ్లి సుఖ్‌దేవ్ సాధుకు రూ. 16వేలు ఇచ్చి, 5.6 కిలోల గంజాయి కొన్నారు. కొత్తగూడెం మీదుగా సికింద్రాబాద్ రైల్లో చేరుకున్నారు. అడ్డగుట్ట వద్ద రైలు ఆగిన సమయంలో ఇద్దరు దిగారు. అక్కడకి చేరుకున్న మిగతా ఇద్దరికి 3.5 కిలోల గంజాయిని రెండు ప్యాకెట్లు అందజేశారు. వీరిద్దరూ బైక్‌పై వెళ్తుండగా టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకుని, విచారించగా 2.1 కిలోల గంజాయి పట్టుబడింది. నలుగురిని అరెస్ట్ చేసి, గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.

■ బీఆర్ఎస్‌లో చేరిన కాంగ్రెస్, బీజేపీ నేతలు
■ కొండాపూర్ మండలంలో వలసలు
■ హ్యాండ్లూమ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్, సంగారెడ్డి అభ్యర్థి చింతా ప్రభాకర్

# కాంగ్రెస్, బీజేపీ ఖాళీ


సంగారెడ్డి అభ్యర్థి చింతా ప్రభాకర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన కొండాపూర్ మండలానికి చెందిన కాంగ్రెస్ నాయకులు


హైదరాబాద్‌లో మంత్రి హరీశ్‌రావును కలిసిన బీఆర్ఎస్ నాయకుడు పట్నం రవితేజ

కొండాపూర్/ సంగారెడ్డి/ సంగారెడ్డి అర్బన్, నవంబర్ 5 : సంగారెడ్డి నియోజకవర్గంలో బీఆర్ఎస్‌లోకి వలసలు పెరగడంతో కాంగ్రెస్, బీజేపీ ఖాళీ అవుతున్నాయి. కొండాపూర్ మండలకేంద్రంలో సర్పంచ్ రుక్మోద్దీన్ ఆధ్వర్యంలో హ్యాండ్లూమ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ చింతా ప్రభాకర్ సమక్షంలో పలువురు నేతలు బీఆర్ఎస్‌లో చేరారు. కొండాపూర్ మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన 70 మంది నాయకులు ఆదివారం బీఆర్ఎస్‌లో చేరారు. దీంతో కొండాపూర్ మండలంలో కాంగ్రెస్, బీజేపీకి భారీ షాక్ తగిలింది. ఈ సందర్భంగా బీఆర్ఎస్‌లో చేరిన నాయకులు మాట్లాడుతూ.. గ్రామాల్లో అభివృద్ధి జరగాలంటే బీఆర్ఎస్‌తోనే సాధ్యమన్నారు. సంగారెడ్డిలో చింతా ప్రభాకర్ విజయం ఖాయమన్నారు.

**మీ బిడ్డనై వస్తున్న నన్ను ఆశీర్వదించాలి..**

హ్యాండ్లూమ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్, సంగారెడ్డి నియోజకవర్గ అభ్యర్థి చింతా ప్రభాకర్ మాట్లాడుతూ.. ఎన్నికల్లో బీఆర్ఎస్ కారు గుర్తుకు ఓట్లేసి, తనను గెలిపించాలని ప్రజలను కోరారు. సీఎం కేసీఆర్‌తోనే ప్రజా సంక్షేమం సాధ్యమన్నారు. రైతుబంధు, రైతుబీమా పథకాలు రైతుకు ఆసరాగా నిలుస్తున్నట్లు పేర్కొన్నారు. కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలతో పేదింటి ఆడపడుచులకు ఓ తండ్రిలా ఆర్థికసాయం ఇవ్వడం సంతోషకరమన్నారు. ఆసరా పింఛన్లు ఎన్నో కుటుంబాలకు ఆసరాగా నిలిచాయని తెలిపారు. తాను ఎల్లప్పుడూ ప్రజల కోసమే ఆలోచిస్తానన్నారు. సంగారెడ్డిలోని ప్రతి కార్యకర్త కసిగా పని చేసి బీఆర్ఎస్ విజయానికి పని చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జడ్పీటీసీ పద్మావతీపాండురంగం, సర్పంచ్‌ల ఫోరం మండలాధ్యక్షుడు రుక్మద్దీన్, నాయకులు సత్యానందం, శ్యాంరావు, ప్రభుదాసు పాల్గొన్నారు.

**కేసీఆర్ పాలన.. తెలంగాణకు శ్రీరామరక్ష**

సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై సంగారెడ్డి మండలం ఇర్గిపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు మన్నె కరుణాకర్‌తోపాటు సుమారు 50 మంది బీఆర్ఎస్ అభ్యర్థి చింతా ప్రభాకర్ సమక్షంలో గులాబీ కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా కరుణాకర్ మట్లాడుతూ... కేసీఆర్ పాలన తెలంగాణకు శ్రీరామరక్ష అన్నారు. కాంగ్రెస్ మాటలను ప్రజలు నమ్మొద్దని, బీఆర్ఎస్ ప్ర భుత్వంలో ప్రజల జీవన ప్రమాణాలు పెరిగాయని, కేసీఆర్ చేసిన అభివృద్ధి పనులను చూసి కారు గుర్తుకు ఓటు వేయాలని కోరారు.

**మంత్రి హరీశ్‌రావును కలిసిన రవితేజ...**

బీఆర్ఎస్ నాయకుడు, ఫసల్‌వాదీ ఉప సర్పంచ్ పట్నం రవితేజ ఆదివారం హైదరాబాద్‌లో ఆర్థిక, వైద్యారోగ్యశాఖల మంత్రి హరీశ్‌రావును కలిశారు. ఇంటింటికీ ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి పనులను వివరిస్తూ ఎన్నికల్లో సంగారెడ్డి అభ్యర్థి చింతా ప్రభాకర్‌ను గెలిపించి ముఖ్యమంత్రికి బహుమతిగా ఇవ్వాలని సూచించారు. పనిచేసే యువతకు ప్రాధాన్యత ఇస్తూ, భవిష్యత్‌లో గుర్తింపు ఇస్తామని మంత్రి స్పష్టం చేశారు.

# ఓఆర్ఆర్‌పై రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి

■ ముగ్గురికి తీవ్రగాయాలు
■ కర్ధనూర్ వద్ద కారు ప్రమాదం

పటాన్‌చెరు, నవంబర్ 5 : ఔటర్ రింగురోడ్డుపై శనివారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి చెందగా, మరో ముగ్గురికి తీవ్ర గాయలయ్యాయి. బీడీఎల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్ నగరంలోని గోల్కొండ ప్రాంతానికి చెందిన ఐదుగురు యువకులు పటాన్‌చెరు వైపుగా కారులో బయలు దేరారు. ముత్తంగి ఔటర్ ఎగ్జిట్‌కు వెళ్లే క్రమంలో వారి కర్ధనూర్ పంచాయతీ పరిధిలోకి రాగానే ముందు వెళ్తున్న గుర్తు తెలియని వాహనాన్ని వీరు ప్రయాణిస్తున్న కారు ఢీకొట్టింది. వేగంగా ఢీకొనడంతో కారులో ప్రయాణిస్తున్న నోమాన్ అలీ(19), మహమ్మద్ మాజిద్ అలీ (19) ఘటనా స్థలంలోనే మృతి చెందారు. అదే కారులో ప్రయాణిస్తున్న ఆసీఫ్, మాజిద్, ఫైజల్ తీవ్రంగా గాయపడ్డారు. వీరిని బీడీఎల్ పోలీసులు హైటెక్‌సిటీలోని యశోద దవాఖానకు తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాలను పోస్టుమార్టానికి పటాన్‌చెరు ఏరియా దవాఖానకు తరలించారు. యువకుల మృతితో గోల్కొండలో విషాదం అలుముకున్నది.

# పటిష్ట ఏర్పాట్లు చేయాలి

■ ఓట్ల లెక్కింపు కేంద్రాల్లో ఏర్పాట్లు
■ జిల్లా ఎన్నికల అధికారి శరత్
■ గీతం యూనివర్సిటీలో రిటర్నింగ్, ఆర్ అండ్ బీ అధికారులతో సమావేశం


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి శరత్

సంగారెడ్డి కలెక్టరేట్, నవంబర్ 5 : ఎన్నికల నిబంధనల మేరకు ఓట్ల లెక్కింపు కేంద్రాల్లో ఏర్పాట్లు ఉండాలని సంబంధిత శాఖల అధికారులకు సం గారెడ్డి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ శరత్ సూచించారు. జిల్లాలో జరగనున్న శాసనసభ ఎన్నికల ఓట్ల లెక్కింపు జరిగే పటాన్‌చెరు మండలం రుద్రారం గ్రామంలోని గీతం యూనివర్సిటీ సమావేశ మందిరంలో ఆదివారం రిటర్నింగ్ అధికారులు, సహాయ రిటర్నింగ్ అధికారులు, ఆర్అండ్‌బీ, ఎన్నికల విభాగం సిబ్బంది, ఇతర శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ శరత్ మాట్లాడుతూ ఓట్ల లెక్కింపునకు సంబంధించి ఎన్నికల క మిషన్ నిబంధనల మేరకు ఆయా ఏర్పాట్లు చేపట్టాలని, అన్ని విషయాలపై అధికారులతోపాటు సిబ్బం దికి పూర్తి అవగాహన ఉండాలన్నారు. కౌంటింగ్ హాల్‌లో ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు ఏర్పాట్లు ఉండాల్సిందేనని స్పష్టం చేశారు. కౌంటింగ్ కేంద్రాల్లోకి అనుమతించడానికి ఉన్న నిబంధనలు, కౌంటింగ్ ఏజెంట్ల నియామక నిబంధనలు, పరిశీలకులకు సంబంధించి చేసుకోవాల్సిన ఏర్పాట్లు, ర్యాండమైజేషన్, పోస్టల్ బ్యాలెట్ కౌంటింగ్ ఎలా చేయాలి?, ఆర్‌వోల బాధ్యతలు ఇతర విషయాలను కలెక్టర్ వివరించారు. గుర్తింపు కార్డులు జారీ, కౌంటింగ్ రూమ్, స్ట్రాంగ్ రూమ్ ఏర్పాట్లు, సీసీ కెమెరాల ఏర్పాటు, వీడియోగ్రఫీ చేయడం, ఎప్పటికప్పు డు ర్యాండమైజేషన్ చేయాలన్నారు.

కౌంటింగ్ కేంద్రాల్లో అవసరమైన వసతులను నిబంధనల ప్రకారం ప్రణాళికతో పూర్తి చేయాలన్నారు. కౌంటింగ్ హాల్‌కు ఎంట్రీ, ఎగ్జిట్ ఉండాలని, గార్డులను నియమించాలన్నారు. నియోజకవర్గాల వారీగా పార్కింగ్ ఏర్పాట్లు చేయాలని, ఓట్ల లెక్కింపు కేంద్రాల్లో విద్యుత్ అంతరాయం లేకుండా చర్యలు తీసుకుని, ఇంటర్నెట్ సౌకర్యం కల్పించాలని సూచించారు. ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు కౌంటింగ్ కేంద్రాల్లో కావాల్సిన వసతులు, ఏర్పాట్లను ప్రణాళికతో చేపట్టాలన్నారు. ఈ నెల 20లోగా 100 శాతం ఓటరు సమాచార స్లిప్పుల పంపిణీ పూర్తి చేయాలని సూచించారు. పీవో, ఏపీవో శిక్షణ పూర్తి చేయాలని, సువిధలో అనుమతులను వెంటనే ఇవ్వాలని, ఎలాంటి జాప్యం చేయరాదని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురి, డీఆర్వో నగేశ్, డిప్యూటీ కలెక్టర్ మహిపాల్‌రెడ్డి, రిటర్నింగ్ అధికారులు, సహాయ రిటర్నింగ్ అధికారులు, ఇతర శాఖల అధికారులు ఉన్నారు.


నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

WANTED

★ రామకృష్ణ గ్రూప్ (TS & AP No. 1) Hyd., VJA. శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల సేవకు ఇంటి/వంట పని, బేబీకేర్ కొరకు వర్కర్లు (M/F) కావలెను. భో+వ+జీతం: 15-21 వేలు. ఏజెంట్లకు కమీషన్: 5,000/-. Ph: 9281452833, 6281208600.
NT-320535

★ *హైదరాబాద్* నందు వృద్ధులను *వారి ఇంట్లోనే ఉండి* చూసుకోవడానికి వర్కర్స్ కావలెను. ఉచిత వసతి, భోజనం. జీ: 15-25 వేలు, ఏజెంట్ కమీషన్: 3-5 వేలు, M/F, 20-50 సం||లు. *హేమ హోమ్ హెల్త్‌కేర్*-7330746999.
NT-320244-All

గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.